ప్రజాశక్తి
సోమవారం 4 డిసెంబర్ 2023
5
విజయనగరం

ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక విజ్జీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపికకు స్పందన లభించింది. ఈ నెల 8, 9, 10 తేదీల్లో విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు సబ్ జూనియర్, క్యాడెట్ విభాగాల జిల్లా జట్లను ఎంపికచేశారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 100 మంది ఫెన్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపిక పోటీలను వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి ముద్దాడ మధు, బిసి అధ్యక్షులు గదుల సత్యలత ప్రారంభించారు. సందర్భంగా చీఫ్ కోచ్ డివి చారి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిగా విజయనగరంలో ఎలక్ట్రానిక్ సామగ్రితో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణీతగా కె.కావ్య వ్యవహరించారు.

ధాన్యం కుప్పలు వేస్తున్న రైతులు

ఉరుకులు.. పరుగులు

కాపాడుకునేందుకు రైతుల అష్టకష్టాలు

ఓవైపు భారీ, అతిభారీ వర్షాలంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు... మరోవైపు దాన్ని బలపరిచే విధంగా రోజురోజుకూ మారుతున్న వాతావరణ పరిస్థితులు... ఇంకోవైపు చూస్తే పంటంతా పొలాలు, కళ్లాల్లోనే ఉంది... ఏ క్షణానైనా చినుకు పడితే..? ఏడాది కష్టమంతా వర్షార్పణమైపోతుంది. దీంతో రెండు రోజులుగా జిల్లాలో రైతులకు కంటిమీద కునుకు కరువైంది. పంటను కాపాడుకునేందుకు ఉరుకులు.. పరుగులతోనే ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. కోసేసిన వరి పంటను కాపాడుకునేందుకు పొలం, కళ్లాల్లో కుప్పలు వేస్తున్నారు.

ప్రజాశక్తి-బొబ్బిలి

మిచౌంగ్ తుపాను ప్రభావం జిల్లాపై తీవ్రంగా ఉంటుందనే వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను కలవరపెడుతున్నాయి. తుపాను వల్ల ఈ నెల ఆరో తేది వరకు భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించడంతో రైతులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. పంట పొలాల్లో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఖరీఫ్ వరి పంట పూర్తి స్థాయిలో కోత దశకు రావడంతో జిల్లాలో మూడింత రెండొంతుల శాతం వరి పంటను రైతులు కోసేశారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో వరి పంట 2,31,835 ఎకరాల్లో సాగైంది. అందులో 66 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం, రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర, మెంటాడ, గజపతినగరం మండలాల్లో దాదాపు 90 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. కోసి ఉంచిన పంట 90 శాతం వరకు పొలాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోసేసిన వరిపంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కొంతమంది రైతులు కోసేసిన వరి పంటను కళ్లాలకు తరలించి కుప్పలు వేశారు. అవకాశం లేక మరి కొంతమంది రైతులు పంట పొలాల్లోనే కుప్పలు వేసి పంటను కాపాడుకుంటున్నారు. పంట పొలాల్లో కుప్పలు వేసిన పంట తడిసిపోతే చేతికి వచ్చిన పంటకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారీవర్షాలు కురిస్తే కోత దశలో ఉన్న మిగతా వరిచేను పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న రైతులను కలవరపెడుతోంది. కోయకుండా ఉన్న పంట నేలకొరిగితే పంటకు నష్టం అధికంగా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటకు నష్టం వాటిల్లితే చేసిన అప్పులు ఎలా తీరుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కళ్లాల్లోనే ధాన్యం

జిల్లాలో దాదాపు 1.54 లక్షల ఎకరాల్లో (66 శాతం) వరికోతలు పూర్తయ్యాయి. నూర్పిడి పూర్తి చేసి, 1242 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కళ్లాల్లో నిల్వ చేశారు. వర్షాలకు ధాన్యం తడిసిపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, కొనుగోలు చేస్తే ఈ పరిస్థితి ఉండేదని కాదని రైతులు చెబుతున్నారు.

అధిక వర్షాలు కురిస్తే మొక్కజొన్న, అపరాలకు నష్టమే

తుపాను ప్రభావంతో భారీ, అతిభారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. అదే జరిగితే మొక్కజొన్న, అపరాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లాలో మొక్కజొన్న సుమారు 20 వేల ఎకరాల్లో, అపరాలు లక్ష ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. అధిక వర్షాలు కురిస్తే పంటలకు నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళ్లంలో నెట్టువేసిన ధాన్యం బస్తాలు

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

పూసపాటిరేగ : తుపాను ప్రభావం చింతపల్లి తీరంలో లేకున్నా సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఏ సమయంలోనైనా భారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తీరంలో విఆర్‌ఒలు, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ భాస్కరరావు తెలిపారు. తుపాను ప్రభావం లేదని మత్స్యకారులు వేటకు వెళ్లే అవకాశం ఉందని, వాతావరణ మార్పులు గమనించకపోతే ప్రమాదాలు సంభవించే ఆస్కారముందని చెప్పారు. ఈ నేపథ్యంలో తీరప్రాంతమంతా అప్రమత్తం చేస్తున్నట్లు వెల్లడించారు. 4, 5 తేదిల్లో భారీ వర్షాలు పడతాయని హెచ్చరికలు ఉ న్నాయన్నారు. తీరంలో ఎక్కడైనా, ఎవరైనా వేటకు వెళ్తే సంబంధిత అధికారులదే బాధ్యత అన్నారు.

ల్యాప్‌టాప్ అందజేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విభిన్న ప్రతిభావంతులకు

అండగా ఉంటాం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటామని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక మెకానిక్ టెంపుల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. దానికి తగ్గట్టే జిల్లాలో కూడా వివిధ కార్యక్రమాల ద్వారా విభిన్న ప్రతిభావంతులకు మేలు చేస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ, పింఛన్ల మంజూరు చేయడంతో పాటు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, కాలిపర్స్, చెవిటి మిషన్లు, ట్రై సైకిళ్లు, బ్యాటరీ బైకులు, మోటార్ బైకులు, తదితర ఉపకరణాలను అందజేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిభ ఉన్నవారికి అంగవైకల్యం అడ్డు కాదని స్పష్టంచేశారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కోరారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ ఎడి జివిబి జగదీష్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కె.ఆర్.డి ప్రసాదరావు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు చదలవాడ ప్రసాద్, వైసిపి వికలాంగుల విభాగం అధ్యక్షులు కొండలరావు, డిసిఎంఎస్ మాజీ అధ్యక్షులు కె.వి.సూర్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

మరణించిన వారి పేర్లు తొలగించాలి

కలెక్టర్ నాగలక్ష్మి ● ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం తనిఖీ

ప్రజాశక్తి-చీపురుపల్లి, రాజాం

మరణించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని, యువ ఓటర్ల నమోదుపై బిఎల్‌ఒలు దృష్టిసారించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం గరివిడి, చీపురుపల్లి, రాజాం మండలాల్లో కలెక్టర్ పర్యటించారు. గరివిడి కాపుశంభాం పాఠశాల, చీపురుపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, రాజాం జిల్లా పరిషత్తు పాఠశాల, జూనియర్ కళాశాలల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. బిఎల్‌ఒల రిజిష్టర్లు, క్లెయిములు, దరఖాస్తులను తనిఖీ చేశారు. ఫారం-6, 7, 8 దరఖాస్తులను, స్లిప్పులు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరణించిన ఓటరు కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చి, వారి పేర్లను జాబితాల నుంచి తొలగించాలని ఆదేశించారు. కుటుంబ సభ్యుల నుంచి డెత్ సర్టిఫికెట్ తీసుకొని గానీ, లేదా పంచనామా నిర్వహించి గానీ పేర్లను తొలగించవచ్చని సూచించారు. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో ప్రధానంగా దీనిపైనే దృష్టిసారించాలని సూచించారు. డోర్ టు డోర్ సర్వేని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికీ బిఎల్‌ఒలు తప్పనిసరిగా వెళ్లి సర్వే చేయాలని ఆదేశించారు. అనామలిస్‌కి సంబంధిం చి, ఒకే డోర్ నంబరులో పదిమంది కంటే ఎక్కువగా ఉన్న ఓటర్లు, సున్నా లేకా తప్పుడు డోర్ నంబర్లు నమోదైన ఇళ్లకు వెళ్లి, తనిఖీ చేసి జాబితాల్లో సరిచేయాలని సూచించారు. ఎటువంటి తప్పులు లేకుండా అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలని కలెక్టర్ కోరారు. ఈ పర్యటనలో అయా మండలాల తహశీల్దార్లు తాడ్డి గోవింద, ఎం.సురేష్, కృష్ణంరాజు, డిటిలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

11, 12న కలెక్టరేట్ ఎదుట

36 గంటల నిరసన

ఎపి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధారాణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశావర్కర్ల సమస్యలపై ఈ నెల 11, 12 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట 36 గంటల నిరసన, వంటావార్పు చేపడుతున్నట్లు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.సుధారాణి తెలిపారు. ఆదివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటుచేసిన ఆశావర్కర్ల సమావేశంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఆశాలు ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వీరిని కార్మికులుగా గుర్తించాలని, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. 60 ఏళ్లు వచ్చే వరకూ పనిచేయించుకొని ఆశావర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించకుండానే తొలగించటం సరైన పద్ధతి కాదన్నారు. ఆశావర్కర్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలన్నారు. ఆశాలపై వేధింపులు ఆపాలని డిమాండ్‌చేశారు. ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించడం ఆపాలన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిపై చేపట్టే 36 గంటల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎల్.శాంతమ్మ, కోశాధికారి మహాలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మి, రాజేశ్వరి, ధనలక్ష్మి, భారతి, అప్పయమ్మ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కాంగ్రెస్ సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చారు. స్వీట్లు తినిపించుకొని, ఆనందం వ్యక్తంచేశారు. అనంతరం రమేష్‌కుమార్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ జూడో యాత్ర ప్రభావం కనిపించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డోల శ్రీనివాస్, రాష్ట్ర మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ షరీఫ్, జిల్లా అధ్యక్షులు రెహమాన్, ఎ.కరీమ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్, నగర అధ్యక్షులు సుంకర సతీష్‌కుమార్ మాట్లాడారు. కార్యకర్తలకు, నాయకులకు దశ, దిశ నిర్దేశించారు.

రోటరీ ఆధ్వర్యాన వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెడ్‌పి కార్యాలయ ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం వృద్ధులకు, వాకర్స్ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణశాంతి మాట్లాడుతూ తిరుమల మెడికవర్ ఆసుపత్రి సహకారంతో ఖరీదైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అవసరమైన వారికి మందులు కూడా అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ప్రవీణ్ అంచాలియా, మాటూరు మురళీకృష్ణ, సూర్యలక్ష్మి, డాక్టర్ రాధికా రాణి, మంజుల, నీతా విజ్వాని తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న రాష్ట్ర నాయకులు

ఎపిటిఒఎ జిల్లా కార్యవర్గం ఎన్నిక

విజయనగరం : ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ విజయనగరం జిల్లా కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణరాజు, ఎన్నికల రాష్ట్ర కన్వీనర్ ఏడుకొండలు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గోపాలం ఎన్నికలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా కె.దుర్గాప్రసాద్ అప్పారావు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా కె.భారతి, ఉపాధ్యక్షులుగా కె.సునీత, కార్యనిర్వాహక కార్యదర్శిగా సతీష్ ఎన్నికయ్యారు.

రక్తదాన శిబిరం

విజయనగరం టౌన్ : కనపాక యూత్ హాస్టల్‌లో స్పందన వికలాంగుల సమాజం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షులు సిరి సహస్ర ప్రారంభించారు. వికలాంగులకు సేవలందిస్తున్న 15 స్వచ్ఛంద సేవా సంస్థలను సత్కరించారు. నైపుణ్యం కలిగిన 10 మంది వికలాంగులకు మెమోంటోలు అందజేశారు. అనంతరం 100 మంది వికలాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో స్పందన సంస్థ అధ్యక్షులు కందివలస సురేష్, హ్యూమన్ రైట్స్ సంతోష్, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, శ్రీనివాస్, జగదీష్, శివ, అభిరామ్ పాల్గొన్నారు.

37 కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం : 37 కిలోల గంజాయిని ఎస్ఇబి సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన నగరంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ సిబ్బందితో కలిసి నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో పెట్రోల్ చేపడుతున్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు నాలుగు బ్యాగుల్లో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి మొబైల్స్ తీసుకుని సీజ్ చేశారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మాజీబర్ రెహమాన్, హ్యాబిబుర్ సర్దార్‌గా గుర్తించారు. వీరు ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయి తీసుకెళ్తుండగా పట్టుబడినట్లు విచారణలో తేలింది. 21 ప్యాకెట్లలోని 37 కిలోల గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ జాన్‌ప్రసాద్, హెచ్‌సి ధనరాజు, ఇసి వెంకటరమణ, గంగాధర్ పాల్గొన్నారు.

త్వరలో అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ

- తొలి విడతలో 6,300 ఎకరాల పంపిణీకి రంగం సిద్ధం
- కొత్తగా మరో 1336 మందికి డి-పట్టాలు
- ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన భూములకు మార్ట్‌గేజ్ ఎత్తివేత
- ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తాం
- 'ప్రజాశక్తి'తో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



జిల్లాలో త్వరలో అసైన్డ్ భూములను క్రమబద్ధీకరిస్తామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పష్టంచేశారు. మరికొంతమందికి కొత్తగా అసైన్డ్ ల్యాండ్ పట్టాలు కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా గతంలో దళితులకు పంపిణీ చేసిన భూములపై మార్ట్‌గేజ్ సైతం ఎత్తివేస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ విషయంలో రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి జెసి ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి



జిల్లాలో ఎన్ని ఎకరాల అసైన్డ్ భూమి రెగ్యులరైజేషన్ చేయనున్నారు.?

జిల్లా వ్యాప్తంగా 30 వేల ఎకరాల భూమిని గుర్తించాం. ఇందులో 6,300 ఎకరాలను తొలి విడతగా పంపిణీ చేసేందుకు కసరత్తు పూర్తయింది. ఈ మేరకు దళితులకు తొలి విడతలో మేలు చేకూరనుంది. అర్హత గలిగిన ప్రతి దళిత రైతుకూ న్యాయం జరిగే విధంగా కృషి చేస్తున్నాం.

రెగ్యులరైజేషన్‌కు అర్హత ఏమిటి.?

20 ఏళ్ల క్రితం ప్రభుత్వం నుంచి అసైన్డ్ పట్టాలు పొందిన భూములన్నీ రెగ్యులరైజేషన్ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. సంబంధిత వ్యక్తుల పేర ప్రభుత్వం పట్టాలు ఇవ్వనుంది. ఇందుకోసం అంటే, 20 ఏళ్ల ముందు జిల్లాలో ప్రభుత్వం ఇచ్చిన భూమి, పట్టాలన్నీ పరిశీలన చేస్తున్నాం. భూములన్నీ గుర్తించినప్పటికీ ఇప్పటికే ఆయా భూముల్లో ఉన్న దళిత రైతుల పేర పట్టాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యాం.

చాలా చోట్ల అసైన్డ్ భూమి చేతులు మారింది? వాటిని ఏ విధంగా పరిగణిస్తారు.?

సంబంధిత భూముల్లో అసైన్డ్ పట్టాదారులు ఉన్నారా? లేక ఇంకెవరైనా సాగుచేసుకుంటున్నారా? అన్నది పరిశీలించాకే నిర్ణయిస్తున్నాం. ఒకవేళ పట్టాదారు లేకపోయినా, వారి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులుంటే రెగ్యులర్ చేసేందుకు అవకాశం లేదు.

ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఎంత మందికి రెగ్యులర్ చేయనున్నారు.?

ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా గతంలో ఇచ్చిన భూముల్లో కొన్ని రెగ్యులర్ చేయడానికి సమాయత్తం చేశాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 216 మందికి మేలు జరిగే అవకాశం ఉంది. వారు సాగుచేస్తున్న భూములపై మార్ట్‌గేజ్ తొలగించేందుకు నిర్ణయం జరిగింది.

కొత్తగా అసైన్డ్ ల్యాండ్ పంపిణీ చేస్తున్నారా? ఎంత మందికి.?

కొత్తగా అంటే... ఇప్పటికే ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటూ జీవనం పొందుతున్న వారిని గుర్తించాం. ఆయా భూములు ఇప్పట్లో ఇతర అవసరాలకు అవసరం లేదనుకున్న చోట సంబంధిత రైతుల పేర అసైన్డ్ పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా 1336 మందికి పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశాం. ఇందులో చీపురుపల్లి నియోజకవర్గంలో లబ్ధిదారులు సంఖ్య, భూమి ఎక్కువగా ఉన్నాయి.

ఈ పట్టాల పంపిణీ మార్ట్‌గేజ్ ఎత్తివేత ఎప్పటిలోగా జరుగుతుంది.?

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ మూడు పద్ధతుల్లోనూ డిసెంబర్ నెలలో మూడు పద్ధతుల్లోనూ పట్టాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యాం. నియోజకవర్గాల వారీగా సభలు ఏర్పాటుచేసి ప్రజాప్రతినిధుల చేతులమీదుగా పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం.

దళితులకు సంబంధించి ఇంకేమైనా ప్రభుత్వం తరపున చేస్తున్నారా.?

అవసరమైన ప్రతిచోట దళితులకు శ్మశానవాటికలు ఏర్పాటు చేయనున్నాం. ఇటీవల 7 గ్రామాల్లో కొత్తగా శ్మశానవాటికలు ఏర్పాటు చేశాం. ఇంకా ఏమైనా దరఖాస్తులు వస్తే పరిశీలించి ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందుకనుగుణంగా ప్రభుత్వ ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి.

ధాన్యం కొనుగోలు ఎలా ఉండబోతోంది.?

ప్రతి సచివాలయ పరిధిలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే అన్ని చోట్ల తూనిక యంత్రాలు, తేమ కొలిచే సాధనాలు సిద్ధంగా ఉంచాం. ప్రతి కొనుగోలు కేంద్రంలోనూ ఒక టెక్నికల్ పర్సన్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌తోపాటు మిగిలిన వ్యవహారాలు చూసేందుకు మరో వ్యక్తిని నియమించాం. సేకరించిన ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు పంపే విధంగా కస్టోడియన్ ఆఫీసర్లను కూడా నియమించాం. ప్రతి ధాన్యపు గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదు.

రాజుకు కలాం ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఏపిజె అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డుకు కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రోటరీ క్లబ్ కార్యదర్శి జెసి రాజును సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, డాక్టర్ బ్రహ్మ దేశం సామాజిక సంస్థ ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ గాంధీనగర్ హనుమంత గ్రంథాలయంలో ఆదివారం అవార్డును ప్రదానం చేశారు. తాను చేసిన సామాజిక కార్యక్రమాలకు అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని రాజు అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపడతామన్నారు. రాజును పట్టణ ప్రముఖులు అభినందించారు.



మాట్లాడుతున్న కోలా మధు

వికలాంగుల సంక్షేమానికి బడ్జెట్ కేటాంచాలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని ఆర్‌కె కళ్యాణ మండపంలో వికలాంగుల రాష్ట్ర సంఘం నిరుద్యోగ జెఎసి ఉపాధ్యక్షులు కోలా మధు అధ్యక్షతన ఆదివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జనసేన నియోజకవర్గ సీనియర్ నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమం కోసం బడ్జెట్ నిధులు కేటాయించి అమలు చేసినప్పుడే వికలాంగుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని దీంతో వారు సమాజంలో గౌరవంగా బతుకుతారని దీనికి జనసేన పార్టీ కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ 5 మండలాల జనసేన అధ్యక్షులు, నాయకులు కె.రామకోటి, సంకర అప్పారావు పెనుమత్స రాజు, గొరపల్లి రవి, రామిశెట్టి శివాజీ, అలమండ రాంబాబు, జాన్నపల్లి సత్తిబాబు, కోల కన్నయ్య దొర, బుజ్జి, కిరణ్, మహిళ సమైక్య సంఘం జిల్లా అధ్యక్షులు నాగమణి, వాలంటరీ హెల్ప్ సర్వీసెస్ ఎన్.హరిబాబు ధరావు ఎలిసెహేచ్ సంఘ నాయకులు కప్పరావు, ఎస్ ఎస్ నాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగదు అందిస్తున్న టిడిపి నాయకులు

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని కూనాయవలసలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు, సాల కాలి బూడిదైన సంగతి తెలిసిందే. ఇందులో ఒక ద్విచక్ర వాహనం కాలిపోగా, ఒక ఆవుకు స్వల్ప గాయాలైన విషయం తెలుసుకున్న టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇంచార్జ్ బేబినాయన బాధితులు వెలగర అప్పారావుకు ఫోన్‌లో పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని మండల టిడిపి అధ్యక్షులు నర్సుపల్లి వెంకట్ నాయుడు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపిపిలు నర్సుపల్లి వెంకటేష్, సింహాచలం, గ్రామ టిడిపి నాయకులు కర్రి సత్యం నాయుడు, మరడాన రమేష్, కర్రి సత్యనారాయణ, బొమ్మి లక్ష్మీనాయుడు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమ్మికపల్లి గ్రామంలో వినాయక్ నగర్ వద్ద ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 40 మంది ఒంటరి వృద్ధులకు ఆదివారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. భీమ్ సేన సభ్యులు ఉమారాణి, రైల్వే రిటైర్డ్ ఉద్యోగి గంటా, అనుపోజు వెంకట్రావు, కార్తీక్, కట్టమూరి సతీష్, ట్రస్ట్ సభ్యుల ఆర్థిక సహాయంతో 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పిఆర్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు, భీమ్‌సేన నియోజకవర్గ అధ్యక్షులు ఉత్తర అప్పారావు మాస్టర్, పిఆర్‌టియు మండల అధ్యక్షులు రవి పాల్గొని పంపిణీ చేశారు. ముందుగా డిసెంబర్ 6 అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం భీమ్ సేన సభ్యుల చేతుల మీదుగా వృద్ధులకు నిత్యవసరాలు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రెటరీ రంగడు ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి, ప్రెజర్ శ్రావణ్ కుమార్, సభ్యులు నగేష్, కోల ఈశ్వరరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియిరెన్స్ పట్టదా..?

- ఆర్ అండ్ బి రహదారుల్లో రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు
- ఎదురెదురు వాహనాలు కనబడక ఇబ్బందులు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఆర్ అండ్ బి రహదారుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. వాటి నిర్వహణను గాలికొదిలే యడంతో అవి అధ్వాన్నంగా మారాయి. అడుగుకో గొయ్యి కనిపిస్తున్న కనీసం మరమ్మతులు చేపట్టేవారు కరువయ్యారు. ఇక జంగిల్ క్లియరెన్స్ ఊసే ఎవరూ ఎత్తడం లేదు. దీంతో రోడ్డు ప్రమాదాలు అనివార్యమవు తున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా ఇంకొందరు క్షతగాత్రులుగా మారుతున్నారు.

మండలంలోని ప్రధాన రహదారులైన విశాఖ -అరుకు ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు బాగా పెరిగిపోయాయి. తుప్పల వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా మదుములు కింద చెత్తా చెదారం పేరుకుపోవడంతో వర్షాలు కురిస్తే రహదారులు దెబ్బతినే పరిస్థితి నెలకొంటుంది. వాస్తవంగా రోడ్డుకు ఐదడుగుల మేర జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి. ఈ విధంగా ఎక్కడా చేపట్టటం లేదు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే జంగిల్ కటింగ్ పనులు చేస్తున్నారు. ఈ ఏడాది ముగుస్తున్నా ఇంత వరకూ రోడ్డు కిరువైపులా జంగిల్ క్లీరెన్స్ చేపట్టిన దాఖలాలు కానరావటం లేదు. చేస్తారన్న నమ్మకం కూడా లేదని వాహన దారులు ఆరోపిస్తున్నారు.

రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

కొర్లవలసకు వైద్యం కరువు

- 50 శాతం మందికి కీళ్ల నొప్పులు
- పట్టించుకోని బూరాడ పిహెచ్‌సి వైద్యాధికారి
- కానరాని జగనన్న సురక్ష

గ్రామానికి వైద్య సేవలు కరువయ్యాయని చెబుతున్న మహిళలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కొర్లవలస గ్రామానికి వైద్య సేవలు అందని ద్రాక్షగా మిగిలిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామం బూరాడ సచివాలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామంలో సుమారు 700 మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామానికి బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, కనీసం ఏఎన్ఎం, ఎంపిహెచ్ఒ కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు కీళ్ల నొప్పులతో బాధపడుతున్న రోగులున్నారంటే అతిశయోక్తి కాదు. చాలా కాలంగా పొట్నూరు పాపమ్మ, బంకి లక్ష్మి, కొవగాన అన్నపూర్ణ, తులసి, పార్వతి, కొరటాల సరస్వతి మరికొంత మంది కీళ్లు, శరీర అవయవాలు నొప్పులతో బాధపడుతున్నారు. బంకి లక్ష్మి, దుప్పాడ సత్యవతి కీళ్ల నొప్పులతో బెడ్ రెడిడ్‌తో మంచాన పడ్డారు. ఇన్ని రోగాలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా తన పరిధిలో ఉన్న బూరాడ వైద్యాధికారి కన్నెత్తి చూడకపోవడం ఏంటని వారంతా ప్రశ్నిస్తున్నారు. షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కొంతమంది గ్రామానికి వైద్య సేవలు కరువయ్యాయని ఏ ఒక్క వైద్యం సిబ్బందీ రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ డాక్టర్లు రాక చేతి చమురు వదిలించుకుని ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. జ్వరాలు, అతిసారా, డెంగీ ఇతరత్రా రోగాలు వస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వాలు వేలకోట్లు వైద్యం కోసం వెచ్చించినప్పటికీ కొర్లవలస గ్రామానికి వైద్య సేవలు అందక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తులు వాపోయారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తమ గ్రామానికి వైద్య సేవల కోసం పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని, వారానికి ఒకసారైనా వైదాధికారి గ్రామాన్ని సందర్శించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకుంటే సిఎం ఫేసీకి, కలెక్టరేట్ స్పందనకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

కీళ్ల నొప్పులతో మంచాన పడిన బంకి లక్ష్మి

కీళ్ల నొప్పులు, బిసి, షుగర్‌తో మంచాన పడిన దుప్పాడ సత్యవతి

ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి రామారావు

రైతు నష్టపోకూడదు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిచౌంగ్ తుఫాను వల్ల ఏ ఒక్క రైతూ నష్టపోకూడదని జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు అన్నారు. ఆదివారం ఆయన కొత్తపేటలో కోసిన, నూర్చిన, కుప్పలు పెడుతున్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను వల్ల రైతులు నష్టపోకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కోత కోయకుండా ఉన్న వరి పంటను మూడు రోజులు వాయిదా వేసుకోవాలన్నారు. రాబోయే రెండు మూడు రోజులలో జిల్లాలో అన్ని ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్నామని తెలపారు. ఒకవేళ ఎవరైనా రైతులు కోసి పంట పనలు తడిచినట్లయితే వెంటనే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకు నిధులేవి..?

- ఎమ్‌పిని ప్రశ్నించిన సర్పంచులు
- విద్య, వైద్యం, హౌసింగ్ పై ధ్వజం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏడు ఏకగ్రీవ పంచాయతీలు ఉండగా వాటికి ఇంతవరకు ఏకగ్రీవ పంచాయతీ ప్రోత్సాహకాలు అందలేదని, గ్రామాలు ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలని చెలికాని వలస సర్పంచ్ పొట్నూరు అప్పలనాయుడు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరయ్యారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకాలు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందని ఏకగ్రీవ పంచాయతీల సభ్యులు ఎంపిని ప్రశ్నించారు. దీనిపై ఎంపి మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సహాకాలు అందలేదని సూచించారు. మనబడి, నాడు నేడులో నిర్మాణాలు చేపట్టినప్పటికీ బిల్లులు చెల్లించడంలో వివక్షత చూపుతున్నారని నిర్మాణాలు నిలిపివేస్తామని సభ్యులు చెప్పగా ఎంపి కలుగజేసుకొని సమగ్ర శిక్ష అభియాన్ జెఇ రవికుమార్‌ను ప్రశ్నించారు. గత జెఇ రమణమూర్తి నిర్లక్ష్య వైఖరితోనే బిల్లులు చెల్లించలేదని, కొత్తగా విధులకు వచ్చానని ఎన్ రవికుమార్ తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గ్రామాల్లో సర్పంచ్, ఎంపిటిసిలకు తెలియజేయకుండా గృహ నిర్మాణాలు, మరుగుదొడ్లు, అంగన్వాడి భవనాలు, ఇతర ప్రభుత్వ నిర్మాణాల కట్టడాలకు సంబంధించి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఇక నుంచి గ్రామాల్లో వారినే ఏలుకోమని సభలో సభ్యుల్లో ప్రశ్నించారు. దీనిపై జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు కలుగజేసుకుని గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేస్తే వారి తాలూకు వ్యవహారం తెలుస్తుందని చెప్పారు. ఎంపిడిఒ శ్యామల కుమారి మాట్లాడుతూ త్వరితగతిన సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని పశువైద్యం అందడం లేదని సభలో సభ్యులు ప్రశ్నించారు. అంతా ఇంచార్జి పాలనలో ఉందని పశువులకు పశువైద్యం అందక ఎన్నో మూగజీవాలు మరణిస్తున్నాయని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపి కలుగు చేసుకుని పశువైద్య కేంద్రాల్లో సరిపడా వైద్యులు లేరని స్వయాన ఆయన సభలో చెప్పడం ఆశ్యర్యాన్ని కలిగించింది. మూడు నెలలుగా మండలంలో హౌసింగ్ బిల్లులు కాలేదని లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపిపి వావిలాపల్లి జగన్మోహన్‌రావు, సభ్యులు ఈఈ రత్నాకర్, జెఇ జగన్ మోహన్ రావును ప్రశ్నించారు. దీనిపై ఈఈ సమాధానం ఇస్తూ కేంద్రం సూచనలు మేరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇచ్చిన జియో ట్యాగింగ్ ప్రాప్తికి బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఎఒ మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలో 12,700 ఎకరాలు వరి సాగు జరిగిందన్నారు. తుపాను కారణంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. రెవెన్యూ, ఐసిడిఎస్, తోటపల్లి, మడ్డువలస, ఉద్యానవనం మరికొన్ని శాఖలపై పూర్తిగా చర్చ జరగలేదు. ఎక్సైజ్, ఆర్‌టిసి శాఖలకు సంబంధించి ఎవరూ హాజరు కాలేదు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారుల, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఏకగ్రీవ పంచాయతీ నిధులు గురించి వివరిస్తున్న ఎంపి బెల్లాన చంద్రశేఖర్

స్వయం ఉపాధికి సహకారం

స్వయం ఉపాధి ప్రోత్సాహానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఐకెపి ఆధ్వర్యంలో సంకిలి, బొడ్డవలస తదితర గ్రామాలకు చెందిన 61 మంది మహిళకు కుట్టు మిషన్ ఏర్పాట్లుకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు స్వయం సాధికారత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎపిఎం బాసిన గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపొందించాలి

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని ఉన్న అన్ని పిఎస్‌లకు సంబంధించిన ఓటర్ల జాబితాలను ఎటువంటి తప్పులూ లేకుండా, స్వచ్ఛమైన ఓటర్ల జాబితాలను తయారు చేయాలని ఆయా పిఎస్‌లకు సంబంధించిన బిఎల్‌ఒలకు చీపురుపల్లి ఆర్‌డిఒ బి.శాంతికుమారి సూచించారు. ఆదివారం సాయంత్రం ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా ఆమె మండలంలోని బైరిపురం పిఎస్‌లకు సంబంధించిన ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఓటర్ లిస్ట్‌లో ఉన్న డెత్‌లు, గ్రామం నుండి ఇతర ప్రదేశాలకు వలస పోయిన వాళ్ళు, పెళ్లి అయిన వాళ్ళు ఎంత మంది ఉన్నారు? ఒక వేల ఉంటే వాటిని వెంటనే తొలగించాలని బిఎల్‌ఒలకు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.విజయ భాస్కర్, డిటి గిరిధర్, గ్రామ ఉప సర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ కె. ధనంజయ పాల్గొన్నారు.

రామభద్రపురం: జనసేన ఆధ్వర్యంలో నూతన ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆరికతోటలో జనసేన నాయకులు కనకల శ్యామ్, అల్లు రమేష్, టిడిపి నాయకులు కూనిశెట్టి భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇక్కడ 149, 150,151 బూత్‌లను సందర్శించి ప్రస్తుతం దాదాపు 3530 ఓట్లు ఉన్నట్లు నిర్ధారించారు. ఇందులో ఇటీవల చనిపోయిన వారు సుమారు 30 మంది ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించాలని బిఎల్‌ఒను కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకొని జనసేన, తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పల్లా తరుణ్, పి. సత్యనారాయణ, వల్లూరు జగదీష్ పాల్గొన్నారు.

మెరకముడిదాం: సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ఓటరు నమోదు కేంద్రాల తనిఖీ

మండల పరిధిలోని ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను స్థానిక తహశీల్దార్ ఆకుల సులోచనరాణి సందర్శించి తగు సూచనలు చేశారు. ఆదివారం తారాపురం, కొండ పాలవలస గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను తనిఖీ చేశారు. నూతన ఓటర్లను చేర్పించే విధంగా 18 సంవత్సరాలు దాటిన యువతకు అవగాహన కల్పించాలని, మరణించిన, శాశ్వతంగా వలస వెళ్ళిన ఓటర్లను తొలగించాలని ఈ ప్రక్రియ పారదర్శకంగా, ఎటువంటి ఫిర్యాదులకు తావు లేకుండా నమోదు అయ్యేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

తెర్లాం : మండలంలోని ఎంఆర్ అగ్రహారం, తెర్లాం, కునాయవలస పలు పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ సాయి శ్రీ, తహశీల్దార్ రత్నకుమార్ ఆదివారం తనిఖీ చేశారు, ఓటర్ల జాబితా సవరణలు, చేర్పులు, తొలగింపులు సక్రంగా సరి చూడాలని బూత్ లెవెల్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

తెర్లాం: సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

భోగాపురం: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక కార్యక్రమాన్ని తహశీల్దార్ చింతాడ బంగార్రాజు ఆదివారం పరిశీలించారు. ఏ రావివలస, గూడెపు వలస, దల్లిపేట, చేపలకంచెరు తదితర పోలింగ్ కేంద్రాల్లోని సిబ్బందికి పలు సూచనలు చేశారు. చనిపోయిన ఓట్లు తొలగించేటప్పుడు విచారణ జరిపి వాటి తొలగించాలని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. ఆయన వెంట ఉప తాసిల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని గత రెండు రోజులుగా నిర్వహించిన ఓటర్ల నమోదు కార్యక్రమంలో పలు ఫారాలను స్వీకరించామని తహశీల్దార్ ప్రసన్నకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 51 పోలింగ్ కేంద్రాల్లో 51 మంది బిఎల్‌ఒలు పనిచేసి 91 ఫారం-6లు, 34 ఫారం-7లు, 31 ఫారం-8లు మొత్తం 156 వివిధ రకాలకు చెందిన దరఖాస్తులు స్వీకరించారని వాటిని పరిశీలిస్తున్నామని చెప్పారు.

అక్రమ కేసులు అన్యాయం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రజలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తే అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు అన్నారు. సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం పెంచిన ఆస్తిపన్ను తగ్గించాలని, చెత్తపన్ను రద్దు చేయాలని కోరుతూ 2021లో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తే అక్రమ కేసులు పెట్టి కోర్టు ద్వారా సమన్లు పంపడం అన్యాయమన్నారు. ప్రజలపై పడుతున్న భారాలు తగ్గించాలని పోరాటం చేస్తే అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 2020లో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద మానవహారం చేస్తే అక్రమ కేసులు పెట్టారన్నారు. గ్రోత్ సెంటర్లో కార్మిక హక్కులు అమలు చేయాలని, కార్మికుల అక్రమ తొలగింపునకు వ్యతిరేకంగా, స్థానికులకు ఉపాధి కల్పించాలని పోరాటం చేస్తే మూడు కేసులు పెట్టారన్నారు. ప్రజలు, కార్మికులు, రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తే అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం స్పందించి అక్రమ కేసులను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో సిపిఎం నాయకులు బి.గోపాల్ ఉన్నారు.

ప్రతి గింజా ప్రభుత్వమే కొంటుంది : ఎమ్మెల్యే

బొబ్బిలిరూరల్: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంటకచినప్పలనాయుడు, ఎంపి బెల్లాన చంద్ర శేఖర్ అన్నారు. ఆదివారం పిరిడి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు మధ్యవర్తులను దళారులను నమ్మవద్దని అన్నారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. దళారులు, మధ్యవర్తులు, మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకుండా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు నేరుగా తమ పండించిన పంటను విక్రయించేందుకు సరైన మార్గం అన్నారు. ధాన్యం సాధారణ రకం క్వింటాకు 2183 రూపాయలు గాను, గ్రేడ్ ఏ రకం 2203 రూపాయలుగాను, ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 21 రోజులలోపు వారి ఖాతాల్లో డబ్బులు నేరుగా జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మీ, వేణుగోపాలనాయుడు, సర్పంచ్ తుట్ట వరలక్ష్మి, ఉప తహశీల్దార్ రెడ్డి, డాక్టర్ సెల్ అధ్యక్షుడు బొత్స కాశినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మి అప్పలనాయుడు, పాల్గొన్నారు.

సోంపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురంలో ఆదివారం రాత్రి టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు నిర్వహిస్తున్న సమావేశాలకు ప్రజాధనాన్ని వెచ్చించి ప్రజలను తరలిస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి మళ్లీ సిఎం కావాలని గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ అధికారులతో పథకాలు గూర్చి ప్రసారాలు చేయించడం సిగ్గు చేటన్నారు. సమావేశాలకు గ్రామ సచివాల సిబ్బందిని కూడా ఉంచి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి మరల సిఎం ఎందుకు కావాలని ప్రశ్నించారు. విచ్చలవిడిగా మద్యాన్ని అమ్ముకోవడానికి, గంజాయి వ్యాపారాలు చేసుకోవడానికి, ఖనిజ సంపదను, ఇసుకను విచ్చలవిడిగా దోచుకోవడానికా అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేయనందుకా? ఎస్‌సి, ఎస్‌టిలకు ఏ విధమైన రుణాలు ఇవ్వనందుకా? ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నందుకా? రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసినందుకా అంటూ గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. అనంతరం టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రతి ఇంటికి ఇచ్చి మన కష్టాలు పోవాలంటే చంద్రబాబును సిఎంను చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు, నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, నాయకులు జనపరెడ్డి ఈశ్వరరావు, ఎం రామకృష్ణ, సిరికి రమణ, జి రమణ తదితరులు పాల్గొన్నారు.

సోంపురంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు గొంప కృష్ణ

ఎస్‌సి కాలనీలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని వల్లంపూడి ఎస్‌సి కాలనీ వాసులు తాగునీటి కోసం కష్టాలు పడుతున్నారు. గత పది రోజుల నుండి కుళాయిల ద్వారా తాగునీరు అందక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం కాలనీ వాసులు తాగు నీటి బోరు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సమస్యను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఇంటింటికి తాగునీరు అందిస్తామని ఉన్న తాగునీటి పైపులను తొలగించి కొత్తగా పైపులు ఏర్పాటు చేశారని కొత్తగా ఏర్పాటు చేసిన పైపుల ద్వారా తాగునీరు రాక, గతంలో వేసిన పైపుల ద్వారా వచ్చే నీటిని కూడా రాకుండా చేయడంతో తాగునీటి కష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎంపిపి డి. సత్యవంతుడు దృష్టికి తీసుకుని వెళ్ళగా కాలనీకి వచ్చి పరిశీలించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడమే తప్ప ఇప్పటి వరకూ ఆయన రాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు తాగునీటిని అందించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఎం. లక్ష్మి, కె మాధవి, ఆర్ సత్యవతి, పి వెంకటలక్ష్మి, కే చిన్నమ్మలు, ఎం కనక, ఎం. వరలక్ష్మి, ఎం. రాజేశ్వరి, పంతం ఈశ్వరమ్మ, యు. రామోజీ, ఏ. శారద, కె. రాము, ఎం. ధనలక్ష్మి. సీనియర్ దళిత నాయకుడు కే. ఏసుదాసు పాల్గొన్నారు.

పది రోజులుగా నీరందక కాలనీ వాసుల అవస్థలు

నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీరు అందకపోవడం వాస్తవమే

వల్లంపూడి ఎస్‌సి కాలనీలో తాగునీరు సక్రమంగా అందలేదని కాలనీ వాసులు తెలిపిన విషయం వాస్తవమే. ప్రస్తుతం జెజెఎం నిధులతో ఇంటింటికి తాగునీరు అందించే కుళాయి పనులు చేస్తున్నాం. అయితే చేసిన పనులకు బిల్లులు అందక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రెండు మూడు రోజుల్లో కాంట్రాక్టర్‌తో మాట్లాడి కాలనీ వాసులకు తాగునీరు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

దేవి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ, వేపాడ

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

గంట్యాడకు చెందిన బెవరిచెట్టి గణపతి (25)ను గుర్తు తెలియని వాహనం ఆదివారం తెల్లవారు జామున ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గణపతి తెల్లవారు జామున కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో కాళ్లు, తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడని ఎస్ఐ కె. కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు. మృతుని సోదరుడు పైడిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మృతి చెందిన గణపతి

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
IP 14/2022

Between:
Pentakota Satyanarayana .....పిటిషనరు
Vs
Bramhasa Chandrasekhara Raju
.......రెస్పాండెంట్

13వ రెస్పాండెంట్ : Fullerton India Credit Company Limited (FICCL) rep by Manager No.7, Ground Floor Vijay Mansion, Siddardha Nagar, Lower Tank Bund Road, Vizianagaram.

ఇందుమూలముగా పైన తెలిపిన రెస్పాండెంటుకి తెలియజేయునది ఏమనగా విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో యిందలి పిటిషనరు I.P.No.14/2022 దాఖలు చేసి యున్నారు. కావున సదరు 13 రెస్పాండెంటు ఎటువంటి అభ్యంతరములు ఆక్షేపణలు ఉన్న యెడల స్వయముగా గాని లేదా వకీలుగారి ద్వారాగాని **తే 21-12-2023 దిన ఉదయం గం॥ 10-30 ని॥** పైన తెలిపిన కోర్టులో హాజరు కావలెను లేని పక్షంలో శ్రీకోర్టువారు పరోక్షంగా తీర్మానం చేయుదురు ఈపత్రిక ప్రకటన ద్వారా నోటీసుగా తెలియజేయుచున్నాము.

K.Surya Tej, Advocate,
Thotapalem, Vizianagaram,
Mobile: 86888 88399